**సరిత** మరణానికి సంతాప సూచకంగా యూనివర్సిటీని ఆ రోజు మూ సివేశారు. కొందరు విద్యార్థులు లైబ్రరీకి వెళ్ళారు. షాపింగ్, మార్నింగ్ షోలకని టౌనుకు బయలుదేరారు మరికొందరు. మిగిలిన వాళ్ళు హాస్టలులోనే ఉండిపోయారు.

జయకు ఏమీ తోచటంలేదు. గదిలో కూర్చుని క్షితిజంవైపు చూస్తూంది. దూరం నుండి సముద్రం ప్రశాంతంగా కనుపిస్తున్నది. కాని హెూరు మాత్రం బాగా వినిపిస్తున్నది.

'ఎంత పని చేశావు, సరితా!' అనుకుంది.

వారిద్దరిదీ గాఢమైన ఆత్మీయత. వ్యక్తం చేయటానికి భాష చాలదు. అంతా వారిని కవలలనుకునేవారు మొదట.


సరిత మనస్తతవం చాలా విచిత్రమైనది. తాను నమ్మిన విషయం ఆధారం చేసుకునే వాదిస్తుంది. అది అమాయకత్వమో మొండితనమో లేక పట్టుదలా చెప్పటం కష్టం. కాని, మొరటుతనం మాత్రం కాదు. మొత్తంమీద సరిత నిర్మల హృదయ. అందరితోను చాలా చొరవగా ఉంటుంది. మనసు విప్పి మాట్లాడుతుంది.

సరిత స్వభావాన్ని కొందరు చలాకీతనమనుకుంటే, కలుపుగోలుతన మనుకున్నారు మరి కొందరు.

క్లాసులు మొదలయిన పదిహేను రోజులకు విద్యార్థులంతా సోషల్ సర్వీసు ప్రారంభించారు. యూనివర్సిటీ కాంప సను క్లాసులవారీగా అందరికి పంచారు.

లైబ్రరీ వెనుక ముళ్ళచెట్లను నరికి నేలను చదును చేస్తున్నారు విద్యార్థులు. నరికిన మొక్కలను దూరంగా పారవేయటం, మట్టిని చదును పరచటం విద్యార్థినుల పని.

# హంతకులు



కెప్టెన్ షేక్ మౌలాలీ

పని ముమ్మరంగా సాగుతోంది. అందరూ చెమటతో తడిశారు.

అనుకోకుండా విచిత్ర సంఘటన నొకటి అక్కడ జరిగింది. మధ్యాహ్నానికల్లా పని ముగించి అంతా వెళ్ళారు.

భోజనాలు ముగించి గదికి చేరుకున్నాక "ఎందుకు, సరితా, అంతమందిలో అలా తొందర పడ్డావు?" అంది జయ.

"నువ్వేమంటున్నావో నా కర్థంకావటం లేదు. చెప్పాలనుకున్నది సూటిగా చెప్పు" అంది సరిత.

"అందరి మధ్యలో జయదేవ్ ముఖాన్ని కొంగు పెట్టి తుడవటం ఏమీ బాగుండలేదు."

"ఇప్పుడేమయిందని?" సరిత ప్రశ్నించింది.

"అంతా నీవైపే చూడటం గమనించావా?"

"ఎందుకు నావైపు చూడటం?"

"అక్కడ దాదాపు వందమంది పనిచేస్తున్నారు. నువ్వు అతణ్ణి..."

"ఆపు, జయా! ఆపు!! ఇదా మన సంస్కారం? పార తీసుకొని గొడ్డులా పనిచేస్తూ, నొసటి చెమట కళ్ళలోకి కారుతుంటే పమిటతో అద్దాను...దానికింత రాద్ధాంతమా?"

"నేనేమీ రాద్ధాంతం చేయలేదు, పెడార్థాలు తీయలేదు. పెడార్థాలు తీసే పక్షంలో నీతో చెప్పవలసిన అవసరం లేదు. ఇప్పుడు మెస్‌లో భోజనాలవద్ద కూడా అంతా నీవైపే చూస్తున్నారు!"

"మరి నువ్వు వారివైపే చూస్తున్నావా?"

"సరితా! వేళాకోళం కోసం నే ననటంలేదు. నువ్వు చేసినది తప్పనటంలేదు. భ్రాతృభావనతో నువ్వు తుడిచి ఉండవచ్చు. సమాజం నీలా ఎదగద్దూ?"

"ఏమో, బాబూ! నేనంత ఆలోచించలేదు. అతణ్ణి చూస్తే జాలి వేసింది. అంతే!"

"అది నీ సహృదయత కావచ్చు. కాని అందులో తొందరపాటు కూడా ఉంది. అక్కడ ఎంతోమంది అమ్మాయిలున్నారు. మరెవ్వరూ అట్లా చేయలేదే! వారికి హృదయం లేదనా? అంతదూర మెందుకు? అరవైకి పైచిలుకు అబ్బాయిలు కూడా ఉన్నారుగా! వారు కూడా తుడవటానికి ముందుకు రాలేదు."

"ఒప్పుకున్నాను, తల్లీ! ఇకనుండి అలాంటి తప్పులు చేయను... రేపటి ఎ సెన్‌మెంట్ అయిందా!" నవ్వుతూ అంది సరిత.

అప్పటికి ఆ సంభాషణ ఆగిపోయింది.

నాలుగు రోజుల తర్వాత క్లాసు నుండి వస్తూ లైబ్రరీకి వెళ్ళిన సరిత రాత్రి ఎనిమిది గంటలదాకా రాలేదు. ఏదైనా అ సెన్‌మెంటు కోసం రిఫర్ చేస్తూ కూర్చుందేమో అని సరిపుచ్చుకుంది జయ.

తొమ్మిది గంటలకు వచ్చిన సరిత అంది- "సారీ, జయా! నా కోసం కూర్చున్నావేమో! ఒకేసారి మెస్‌కి కూడా వెళ్ళివచ్చా!"

కాని జయ ఆ రాత్రి భోజనం చేయని సంగతి సరితకు తెలియదు.


"ఇప్పటి వరకు లైబ్రరీలోనే ఉన్నావా?" అడిగింది జయ.

"ఇదే ప్రశ్న వేరే ఎవరైనా వేసి ఉంటే..."

"ఊఁ. ఆగావే...కానియ్!" నవ్వింది జయ.

"బుర్ర రామకీర్తన పాడి ఉండేది!" శ్రుతి కలిపింది సరిత.

"ఎందుకో!"




"లైబ్రరీకి కాకపోతే మరెక్కడికి వెళ్ళి ఉంటానంటావు!"

"కొత్త అ సైన్‌మెంటు ఏదైనా తయారు చేస్తున్నావా?"

"లేదు...అతనిలో సంస్కారం చూశావా, జయా! లక్షల ఆస్తికి ఒక్కడే వారసుడు. ఎన్నో వ్యాపారాలున్నాయి. ప్రపంచ దేశాలు చాలావరకు పర్యటించాడు...కాని ఎంతటి ఆదర్శమో!"

"ఎవరు?" మధ్యలో అడిగింది జయ.

"ఆపకు- పూర్తిగా చెప్పనీ! పెద్ద చదువు, మంచి అందం ఉన్నాయి. రాజ్యాలు ఏలగల సమర్థుడు. అతని ఆదర్శం ముందు ఎంతోమంది పురుష పుంగవులు బలాదూర్!"

"అబ్బ! ఈ సస్పెన్స్ భరించలేకపోతున్నాను! త్వరగా కానియ్!"

"ఒక బీదింటి అమ్మాయిని పెళ్ళాడాడు. ఆమె పెద్ద అందగత్తె కాదు. అంతగా చదువుకోనూ లేదు. గొప్ప కుటుంబంలోంచి కూడా రాలేదు. పోనీ, ఏదైనా ఒక కళలో విశేష ప్రావీణ్యముందా అంటే అదీ లేదు. కులం కూడా కొంత తక్కువే! అయినా చేసుకున్నాడంటే, అతను నిజంగా దేవుడే!"

జయ ఎదురు మాట్లాడకుండా కూర్చుని వింటోంది.

"పెళ్ళి చేసుకొని ఆమె కుటుంబానికి ఎంత సహాయం చేశాడో తెలుసా! ఆమె చెల్లెళ్ళకి మంచి సంబంధాలు చూసి వివాహాలు జరిపించాడు. తమ్ముళ్ళని చదివించి వారికో దారి చూపాడు. అత్తమామల్ని తన ఇంట్లోనే ఉంచుకొని ఏ లోటూ రాకుండా కన్నకొడుకు కంటె మిన్నగా చూసుకున్నాడు...నిజంగా అతనొక తపస్వి!"

జయ వింటూ నోరు మెదపకుండా అలాగే కూర్చుంది.

తిరిగి సరిత చెప్పసాగింది—"జయా! ఆ పుస్తకం నువ్వు తప్పక చదవాలి!"

షాక్ తిన్నంత పనైంది జయకు. "పుస్తకమా?" అంది.

"అవును. ఎంత బాగుందో ఆ నవల!"

"చూడు, సరితా! ఒక్క ప్రశ్న అడగనా!"

"ఒక్కటేమిటి ఖర్మ! లక్ష అడిగినా ఈ సమయంలో పర్వాలేదు!"

"అలాంటివాళ్ళు ఈ సమాజంలో ఉంటారంటావా?" అడిగింది జయ.

"అంటే నీ ఉద్దేశం ఆ నవల పచ్చి అబద్ధం అంటావా?"

"అబద్ధమే కాదు, మోసమంటాను. ఇలాంటి నవలల్ని చదివి ఎందరో అమాయక యువతులు అనవసరపు ఊహలలో జీవితాల్ని..."

"ఆగా వెందుకని? జీవితాల్ని...?" రెట్టించింది సరిత.

"నాశనం చేసుకుంటున్నారు!" పూరించింది జయ.

"ఎందుకని?"

"అలాంటి పుస్తకాలు చదివిన కొందరు యువతులు ఆ నవలల్లోని హీరోలాంటివాడు తటస్థపడకపోతాడా అని ఊహించుకొని జీవితాలు వ్యర్థం చేసుకుంటున్నారు. చాలా మంది మోసపోతున్నారు కూడా!"

సరితకు సహనం చచ్చింది.

"ఒక్కమాట అడగనా, జయా!" అంది.

"నే వద్దన్నా నువ్వు ఆగవుగా! అలాగే కానీ!"

"అలాంటివారు సమాజంలో ఉండరంటావా?"

"ఊహ వేరు, జీవితం వేరు, సరితా! అలాంటివారు ఉండరనే నా అభిప్రాయం. పోనీ, నువ్వెప్పుడైనా చూశావా అలాంటివారిని?"

"చూస్తేనే నమ్మాలా? మనకు తెలీకుండా ఉండవచ్చుగా..."

"ప్రపంచ చరిత్రలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఇలాంటి సంఘటన జరిగితే అది ఆ వ్యక్తి వరకే పరిమితం. అయినా నా మన సెందుకో నీవు చెప్పినలాంటి 'దేవుడు' ఉంటాడని ఊహించలేకపోతోంది. అది పుస్తకాలు, సినిమాల్లోనే సాధ్యం! కారణం- రసస్థాయి తగ్గి, వాటి లక్ష్యం వినోదంగా మారింది నేడు. వాటి సమయం మూడు గంటలకే పరిమితం...కాని జీవితం నూరేళ్ళ పంట."

"ఇంతకూ నువ్వు చెప్పదలచుకున్నదేమిటి?"

"ఏముందీ! అలాంటి ఆదర్శమూర్తి ఈ ఆకలి కాలంలో ఉండడు! మరో విషయం...జీవితంలో

ఊహలు ఉండవచ్చు. కాని, ఊహల్లోనే జీవితం గడపకూడదు!"

"ఏమో, తల్లీ! ఎమ్.ఎ. కాకమునుపే లెక్చర్ దంచేస్తున్నావు."

ప్రొద్దు పోవటంతో ఇద్దరూ ఆవలించి పడుకున్నారు.

నాలుగు నెలలు గడిచాయి. క్రిస్మస్, సంక్రాంతి సెలవులు ఏకంగా కలిపి ఇచ్చారు. సెలవుల తర్వాత టెర్మినల్ పరీక్షలు పెడతామన్నారు.

సాయంకాలపు చిరుచలులలో బీచి ఒడ్డుకు చేరారు స్నేహితురాళ్ళిద్దరూ. పశ్చిమంగా డాల్ఫిన్స్ నోస్ వెనుక ఆదిత్యుని అరుణ కిరణాలు ఆకాశంలోకి వాడి బాణాలలా చొచ్చుకు పోతున్నాయి. తూర్పున పున్నమి చంద్రుడు మెల్లగా జలనిధి నుండి పైకి ప్రాకుతూ తెల్లగా నవ్వుతున్నాడు. అలల నుండి చేటలతో చల్లినట్లుగా నీటి తుంపరలు వివిధ రంగులలో మెరుస్తున్నాయి.

ప్రశాంత ప్రకృతిని ఆస్వాదిస్తూ దాదాపు పావు గంట కూర్చున్నారు.

"జయా! వివాహం గురించి నీ అభిప్రాయం ఏమిటి?" నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ అంది సరిత.

"ఆ ప్రశ్న ఇప్పుడెందుకు?" వారించినట్లు అంది జయ.

"ఊరికే అడుగుతున్నాను." సరిత సమాధానం చెప్పింది.

"వివాహం గురించి అందరి అభిప్రాయమే నాది కూడా. ఇందులో ఒకరి అభిప్రాయం అంటూ ఏమీ ఉండదు."

"గోడమీద పిల్లివాటంగా మాట్లాడకు... నే నడిగేది పెద్దలు చూసిన సంబంధం మంచిదా, లేక స్వతంత్రంగా ఎంచి చేసుకోవటం మంచిదా అని నా ప్రశ్న!"

"సూటిగా సమాధానం కావాలా?"

"ఆఁ!"

"ముందు ఆ చెత్త నవలలు చదవటం మానెయ్. తర్వాత ఈ ఆలోచనలు అవే పోతాయి."

"చెప్పదంటు సమాధానాలతో సరిపుచ్చకు. సమాధానం చెప్పగలిగితే సరే. లేకపోతే మానెయ్!"

"అయితే, విను. ఎవరైనా కోరుకునేది ప్రశాంత జీవనం. దానికి పెద్దలు చూసినా ఫరవాలేదు; లేక తగిన సంబంధం వస్తే స్వతంత్రంగా చేసుకున్నా తప్పులేదు. కాని ఒక విషయం మాత్రం మరువకూడదు."

"ఏమిటది!"

"చూడు, సరితా! మన మిద్దరం పల్లెసీమల నుండి వచ్చాం. మన తల్లితండ్రులు పెద్దగా చదువుకున్న వారు కారు. మనకున్న డిగ్రీలు వారికి అర్థం కూడా కావు. కాని అనుభవం చాలా గొప్పది. చదువుకున్న పుస్తకాల కంటే, అనుభవం నేర్పే పాఠాలు మహత్తర మైనవి. కనుక పెద్దలు చేస్తేనే ఎక్కువ అవగాహన ఉంటుంది. ప్రేమ వివాహాలలో ఎక్కువగా ఆవేశం ఉంటుంది. స్పందన లోపించినప్పుడు విపరీత పరిణామాలు ఉత్పన్నమవుతాయి. అయితే, మనం గిరి గీచి చెప్పటం కూడా కష్టమే ననిపిస్తుంది."

"అయితే, పెద్దలు ఆలోచించినంత మనం ఆలోచించ లేమా?"

"అని నేను అనలేదు. ఒకోసారి పెద్దల కంటే ఎక్కువగా కూడా ఆలోచించ వచ్చు. అందుకే కొందరు కొన్ని ఇబ్బందులకు లోనవుతారు. అయితే, కొన్ని సందర్భాలలో పెద్దలు చూసిన సంబంధాలు కూడా తెగిపోవచ్చు. కాని అరుదు... లేచి పద! హాస్టలు గేటు మూసేస్తారు" అంది జయ.

సెలవుల తరువాత వచ్చిన సరితలో ఏదో కొంత మార్పు గమనించక పోలేదు జయ.

ఓ వారం రోజుల తర్వాత క్లాసు నుండి వస్తూ అంది సరిత: "జయా! నేనంటే నీకిష్టమే కదూ!"

"ఇష్టమా! నా కో చెల్లెలంటూ ఉంటే ఆమె కన్నా నిన్నే ఎక్కువగా చూసుకునే దాన్ని!" నవ్వుతూ సమాధాన మిచ్చింది జయ.

"అయితే, నీతో ఒక విషయం చెప్పాలి!"

"ఏమిటో అది!"

"నే నొకతన్ని ప్రేమించాను. నాకంటే అన్ని అర్హతలు కలవాడు. చాలా యోగ్యుడు. ఒక్క మాటలో చెప్పాలంటే నే నతని హృదయ కుసుమాన్నట!"

"సరే!" నిర్లిప్తంగా అంది జయ.

"కొంత కాలం మా ఇద్దరి మధ్య ఉత్తరాలు తిరిగాయి. ఈ సెలవుల్లో ఇంట్లో వేరే కారణం చెప్పి నేను, అతను కలిసి హనీమూన్‌కు వెళ్ళొచ్చాము."

అదిరి పడింది జయ. "హనీమూనా?" అప్రయత్నంగా వెలువడింది ఆమె నోటి నుండి.

RADEUS/SB/5-83

దోమలా?








మీ కుటుంబం రాత్రంతా హాయిగా నిద్రపోయేందుకు
సురక్షితమైన, శక్తివంతమైన సాధనం
రూస్టర్
మస్కిటో కాయిల్ "ఫోర్టెక్స్" గులది

తయారు చేస్తున్న వారు:
సన్-అప్ బొటానిక్స్ ప్రై. లి.
788/1 జి.ఐ.డి.సి., వాపి, గుజరాత్.
డిస్ట్రిబ్యూటర్లు: రాల్లిస్ ఇండియా లిమిటెడ్




"ఏం? ఆశ్చర్యంగా ఉందా? మేము కావాలనే ఈ విప్లవాత్మక ప్రయోగం చేశాం. రెండు హృదయాలు కలవటమే వివాహం. మాకు ఈ సమాజపు కారణ రహిత ఆచారాలు అక్కర లేదు."

జయ ఎదురు మాట్లాడలేదు. వింటూ నడుస్తోంది.

"తాళి కడితేనేనా భర్త? చుట్టాలంతా వచ్చి నాలుగు రోజులు మన ఇంటి మీద పడి తింటేనే నా పెళ్ళి? తల్లితండ్రులు మూ డు నెలలు తిరిగి చే స్తేనేనా సంబంధం? అందుకే సమాజపు కట్టుబాట్లు మాకు రుచించలేదు. మామనసులు కలిశాయి. హృదయాలు ఏకమయ్యాయి." ఎంతో గర్వంగా చెప్పుకు పోతూంది సరిత.

"మరి నాన్న వాళ్ళతో ఈ విషయం ప్రస్తావించేవా?" కావాలని అడిగింది జయ.

"అదే థ్రిల్ అంటే. మొదటి బిడ్డ పుట్టేవరకు ఇంట్లో చెప్పకూడ దనుకున్నాము ఇద్దరం. ఎలా ఉంది, జయా, మాతిరుగుబాటు? ఈ విషయం నీకు ఒక్కర్తికే తెలుసు. నా కడుపు పండిన వేళ మా అమ్మ, నాన్నలకు కనుల పండుగ చేస్తాను. అంత వరకు వేచి ఉండాల్సిందే!"

ఆ క్షణంలో ఏం మాట్లాడినా లాభం లేదనుకుంది జయ.

మరో రెండు నెలలు గడిచాయి.

హాస్టలు ఆవరణలో మామిడి ఆకుల మధ్య శివలింగాల్లాంటి చిన్న చిన్న కాయలు తొంగి చూస్తున్నాయి. సరిత దృష్టి వాటిపై పడింది.

మెస్‌లో ప్లేటు ముందు కూర్చున్న సరితకు అన్నం రుచించలేదు. బేసిన్ దగ్గరకు వెళ్ళి వాంతి చేసుకుంటూంది. హడావిడిగా వచ్చి చెవులు మూసిన జయతో అంది- "భయపడకు, జయా! తల్లిని కాబోతున్నందుకు నా కెంతో సంతోషంగా ఉంది. నేను వస్తున్నానని ఆయనకు రేపు ఉత్తరం రాసి నాలుగు రోజులు అక్కడ ఉండి వస్తాను."

కాని జయ కంగారును సరిత అర్థం చేసుకోలేదు.

వారం రోజులకు సరిపడే బట్టలు సర్దుకొని శనివారం రాత్రి బయలుదేరి వెళ్ళిన సరిత ఆదివారం రాత్రికే వచ్చింది.

ముఖంలో అలసట స్పష్టంగా కానవస్తోంది.

"ఏమయింది? అప్పుడే తిరిగి వచ్చేశావు! మీ వారు లేరా!" ఆదుర్దాగా అడిగింది జయ.

"పొద్దు పోయింది- పడుకుందాం. అన్ని కబుర్లు రేపే!" సరిత సమాధానం చెప్పింది.

మరురోజు ఇద్దరూ ఆ ప్రస్తావన ఎత్తలేదు. యథాప్రకారం క్లాసులకు వెళ్ళి వచ్చారు.

ప్రొద్దు కూకవస్తోంది.

"నాలుగడుగులు బీచ్ వైపు వెళ్ళి వద్దామా!" అంది సరిత.

"రేపు అ సైన్‌మెంటు సబ్మిట్ చెయ్యాలి! నాది కొంతవరకు అయింది. నువ్వు ఊరెళ్ళి వచ్చావు. అసలు మొదలు పెట్ట లేదుగా! కూర్చుని తయారు చెయ్యి." జయ అంది.

"నా అ సైన్‌మెంట్ ఎప్పుడో అయిపోయింది. ముందు బయలుదేరు విసిగించక! తల నొప్పిగా కూడా ఉంది." సరిత కొంచెం బలవంతం చేసింది.

జయ అడ్డు చెప్పక బయలు దేరింది.

ఆ రోజు ఎందుకో అలలు ఉవ్వెత్తుగా లేస్తున్నాయి. ముఖాన తుంపరలు చిమ్మేంత దగ్గరగా కూర్చున్నారు.

"మీవారి కబుర్లేమిటి?" జయ కావాలని అడిగింది.

"ఆ విషయం చెప్పటానికే నిన్ను ఇక్కడికి తీసుకువచ్చింది" అని నవ్వింది సరిత. వెంటనే శోకం పెల్లుబికి వెక్కి వెక్కి ఏడవసాగింది.

"అస లేమయిందో చెప్పు! బాధపడకు. విషయం తెలి స్తే తరణోపాయం ఆలోచించవచ్చు!" జయ ఓదార్చింది.

"నువ్వెళ్ళేసరికి ఆయనేం చేస్తున్నారు?" మళ్ళీ అడిగింది జయ.

"ఇంటిముందు లాన్‌లో అతను, అతని భార్య పిల్లలతో ఆడుకుంటున్నారు."

జయ ముఖకవళిలు గమనించి తిరిగి చెప్ప సాగింది సరిత:

"అతనికి ముందే పెళ్ళయింది, జయా! గేటు తీసుకొని లోపలకు వెళ్తున్న నన్ను చిరునవ్వుల మధ్య ఆహ్వానించాడు. ఎదురుగుండా టీపాయ్ మీద రాసిన ఉత్తరం కూడా పెట్టి ఉంది. పిల్లలు 'డాడీ! డాడీ!' అంటూ ఆడుకుంటూ తిరుగుతున్నారు. భార్య ప్రక్కనే మరో కుర్చీలో కూర్చుని ఉంది."

'ఏమిటండీ ఇదంతా' అన్నాను. 'నువ్వు చూ సేదంతా నిజమే' అన్నాడు. 'నన్ను మోసం చేశా'రన్నాను. 'నిన్నే ఎందుకు మోసం చేయవలసి వచ్చిం'దని ఎదురు ప్రశ్నించాడు. వెంటనే నా దగ్గర సమాధానం లేక పోయింది.

'చూడు, సరితా! అది నీ బలహీనత! అంతే! పరాయి మగాడికి ఉత్తరాలు రాయటం, అతనితో తిరగటం నీకు అలవాటయి ఉండాలి!' అన్నాడు.

'ఏమిటండీ మీరనేది' అని గద్దించాను. అతని భార్య అక్కడ నుండి లేచి లోనికి వెళ్ళిపోయింది. పిల్లలు ఆటలో మునిగిపోయారు. బహుశా ఇలా చేయటం అతనికి అలవాటు కావచ్చు! జీవితాలతో ఆడుకుంటాడు కాబోలు!"

"తర్వాత ఏమయింది?" జయ అడిగింది.

"ఏమయింది? ఊహించని దుష్పరిణామానికి తర్కించలేకపోయాను. అతనే అన్నాడు... 'మన ఇద్దరం కలిసి తిరిగిన మాట నిజమే! కాదనను. నువ్వు ఇక్కడికి రావద్దు. నేనే తీరిక దొరికి నప్పుడు... నీ మీద గాలి మళ్ళినప్పుడు మీ ఊరు వస్తుంటాను. అలా చే స్తే నా భార్య అడ్డు చెప్పదు.'

'అంటే నా స్థానం ఏమిటి?' అని అడిగాను.

'ఏమని చెప్పమంటావు! ఆ ప్రశ్న ఇప్పుడనవసరం. మరో విషయం గుర్తుంచుకో! నువ్వు మైనరువి కాదు. నిన్ను మోసం చేశానంటే చట్టం ఒప్పుకోకపోవచ్చు. కారణం- జరిగిన దానిలో నీవు కూడా భాగస్వామినివే! చట్టాన్ని ఎలాగయినా మార్చుకోగల శక్తి నాకుంది. అంటే నా వాళ్ళు ఉన్నారు.' చాలా నింపాదిగా అన్నాడు.

'నీకు పెళ్ళయినట్లు నాకు చెప్పలేదుగా... దుర్మార్గం కాదా!' అన్నాను.

'నువ్వు అడగనూ లేదు, నేను చెప్పనూ లేదు. నా వివరాలు పూర్తిగా తెలుసుకోకుండా నా వెంట తిరిగా వంటే, నువ్వు మంచిదానివని కూడా ఎవ్వరూ నమ్మరు' అన్నాడు.

'ప్రస్తుతం నేను గర్భవతిని' అన్నాను.

'అది నా కనవసరం, దానికి కారణం నేనే అని ఎవరు రుజువు పరచగలరు? వేరే మరెవ్వరైనా కూడా కావచ్చుగా!' అన్నాడు.

ఇక అక్కడ ఒక్క క్షణం ఉండలేదు. లేచి వచ్చేశాను. జయా! జీవిత సత్యాలను గురించి నువ్వెంత చెప్పినా వినలేదు. ఫలితం అనుభవించాను." సరిత సముద్ర తరంగాల కేసి చూస్తూ చెప్పుకు పోతోంది.

"మరొక యువతి అయి ఉంటే ఇప్పటికి ఏ రైలు క్రిందనో, లేక ఏ ఉరితాడుకో బలైపోయి ఉండేది. నేనలా చేయలేదు. నా తల్లితండ్రులకు నేనొక్కర్తినే సంతానమన్న విషయం నీకు తెలును. ఒకవైపు కడుపు కోత... మరోవైపు ఘోరావమానపు గుండెకోతకు వారిని గురి చేయలేను. ఇంతకూ నన్ను మోసం చేసింది ఎవరో తెలుసా... ఒక రచయిత!"

జయకు నెత్తిన పిడుగు పడినంత పని అయింది.

"జయా! నువ్వు ఒక మేలు చేయాలి! నా రహస్యం ఎవరికీ తెలియకూడదు. బహుశా ఈ అనంత జలరాశిలో నేను ఏ నాడైనా కలిసిపోవచ్చు... కంగారు పడకుండా విను... అప్పుడే చావమలే! నన్ను వెలికి తీయవద్దని చెప్పు. నా శరీరం ఈ జలనిధిలోని వివిధ జీవరాసులకు ఉపయోగపడాలి. సముద్రపు నురుగులో ఆడుకుంటుంటే పెద్ద అల వచ్చి సరితను లాక్కుపోయిందని చెప్పు" అంటూనే అలలవైపు పరుగెత్తింది. ఉవ్వెత్తు తరంగాలు సరితను కౌగలించుకున్నాయి.

"సరితా!" అన్న జయ కేక సముద్రపు హోరులో కలిసిపోయింది.*